సాక్షి మంచిర్యాల

ఆదివారం • 6 • ఏప్రిల్ • 2025



సీపీని కలిసిన బీజేపీ నాయకులు

మంచిర్యాలక్రైం: సీపీ అంబర్ కిషోర్ ఝాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్, దుర్గం అశోక్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.



వాలీబాల్ పోటీల విజేత హైదరాబాద్

గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజేతగా, బెల్లంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు బెల్లంపల్లి జీఎం బహుమతి ప్రదానం చేశారు.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0 /24.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదలందరికీ సన్నబియ్యం



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: రాష్ట్రంలోని పేదలందరికీ సన్న బియ్యం అందించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. శనివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, గజ్జెల అంకాగౌడ్, ముత్యాల బాపాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారు ఇంట్లో ఎమ్మెల్యే, కలెక్టర్ భోజనం



భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం సన్నబియ్యంతో భోజనం చేశారు. రేషన్‌దుకాణంలో బియ్యం పంపిణీ అనంతరం లబ్ధిదారుడు మేడ తిరుపతిరెడ్డి ఇంట్లో సన్న బియ్యంతో వండిన అన్నం తిన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ ఈడీగా చిరంజీవి బాధ్యతల స్వీకరణ



ఈడీకి స్వాగతం పలుకుతున్న జీఎం

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) నూతన ఈడీగా చెన్న కేశవుల చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్టీపీపీ ఈడీగా చిరంజీవిని నియమిస్తూ సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఉత్తర్వులు జారీ చేశారు. చిరంజీవి ముందుగా ఎస్టీపీపీ మైసమ్మతల్లి ఆలయం, సీతారామచంద్రాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అడ్మిన్ భవన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జీఎం శ్రీనివాసులు, సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాసులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, మురళీధర్, అజ్మీరాతుకారం, తదితరులు పాల్గొన్నారు.

'కేసులకు భయపడేది లేదు'

బెల్లంపల్లి: ప్రభుత్వ భూముల కబ్జాలను బయటపెడుతున్న తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, అక్రమ కేసులకు భయపడేది లేదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. భూ దందాల వ్యవహారాలను ప్రశ్నించినందుకు వేమనపల్లి, బెల్లంపల్లి, తదితర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఎవరో వ్యక్తి సోషల్ మీడియాలో చేసిన పోస్టును మరో గ్రూపులో ఫార్వర్డ్ చేసిన నాయకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం దారుణమని తెలిపారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యే, ఆర్డీవో, పోలీసు అధికారులపై ఉందని తెలిపారు.

టీచర్లను రిలీవ్ చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 7నుంచి ప్రారంభమయ్యే స్పాట్ వాల్యూయేషన్‌కు మూడేళ్ల నుంచి పదో తరగతి బోధన అనుభవం కలిగిన టీచర్లను హెచ్‌ఎంలు విడుదల(రిలీవ్) చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో బోధనలో అనుభవం కలిగి ఉండి, మూల్యాంకనం చేసే వారు బోధన, అనుభవ సర్టిఫికేట్ హెచ్‌ఎంల ద్వారా తీసుకురావాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతిలేదని తెలిపారు. హెచ్‌ఎంలు పాఠశాలల్లో ఎస్‌ఏ-2 పరీక్ష నిర్వహణకు కనీస ఉపాధ్యాయులు ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో పాల్గొనే టీచర్లందరూ ఏసీసీ కాన్వెంట్ హైస్కూల్‌లో ఈ నెల 7న ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

నేడు రాములోరి పెళ్లి..



దండేపల్లి: రామాలయంలో సీతారాముల విగ్రహాలు

- జిల్లాలో ముస్తాబైన ఆలయాలు
- భక్తుల కోసం ఏర్పాట్లు
- నేడు శ్రీరామనవమి

మంచిర్యాలఅర్బన్: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి జిల్లాలోని కోదండ రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం అంగరంగ వైభవంగా జరిగే కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి మామిడి తోరణాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న చెన్నూర్ మండలం సుద్దాల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, వందేళ్లనాటి పాత మంచిర్యాల రామాలయం, శివాలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంచిర్యాల విశ్వనాథ స్వామి ఆలయం, గౌతమినగర్ కోదండరామాలయం, ఏసీసీ, గర్మిళ్ల హనుమాన్ టెంపుల్ తదితర ఆలయాల్లో కల్యాణం నిర్వహించనున్నారు. దండేపల్లిలో సీతారాముల కల్యాణంలో భాగంగా శనివారం హనుమాన్ దీక్షాపరులు, భక్తులు బ్యాండుమేళాలు, మంగళహారతులతో ఎడ్లబండ్లలో పాలపారకను తీసుకొచ్చారు. రామాలయం వద్ద పందిళ్లపై పాలపారకను వేసి పెళ్లి వేడుకలు ప్రారంభించారు.



దండేపల్లి: రామాలయానికి పాలపారక తీసుకొస్తున్న భక్తులు



మందమర్రిరూరల్: ఎంవీటీసీ పక్కన కల్యాణ వేదిక ఏర్పాట్లు



మంచిర్యాలలోని ఆలయం వద్ద చలువ పందిళ్లు

విచారణకు కలెక్టర్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'బతికుండగానే చంపేశారు' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పందించారు. పట్టాదారుకు తెలియకుండా అక్రమ పట్టా ఎలా చేశారు? దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణను ఆదేశించారు. దీంతో ఆయన నెన్నెల మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రకాశ్‌ను ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా సూచించారు. ప్రస్తుతం నెన్నెల తహసీల్దార్ సెలవులో ఉండగా, డీటీ ప్రకాశ్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్నారు. దీంతో అసలు పట్టాదారు చనిపోయినట్లుగా సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన వారిపై, అందుకు సహకరించిన రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు పూర్తి నివేదిక తీసుకోనున్నట్లు తెలిసింది. మరోవైపు తెరవెనుక తంతగం నడిపింది అక్కడ ధరణి ఆపరేటర్‌గా పని చేస్తున్న వ్యక్తిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అక్రమ మార్గంలో భూమి పొందాలనుకున్న వారిలో సైతం తాజా పరిణామాలతో వణుకు మొదలైనట్లుగా తెలుస్తోంది.

కూలీ పని లేదు..!



కూలీ పనుల కోసం అడ్డా మీద ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బెల్లంపల్లి: 'కొండలు పగలేసినం.. బండలను పిండినం.. మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు కట్టినం. శ్రమ ఎవడిదిరో.. సిరి ఎవడిదిరో..' అంటూ శ్రమజీవుల ఔన్నత్యం, కష్టార్జితాన్ని ఎలుగెత్తి చాటారు ప్రజాకవి చెరబండ రాజు. ఆ శ్రమజీవులు చెమట చిందించని రంగమేదీ లేదు. ప్రాణాలకు తెగించి.. కండలు కరిగించి ఆకాశ హార్మ్యాలు నిర్మించారు. కానీ నేడు భవన నిర్మాణ కార్మికులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న వారికి కూలీ పనులే దొరకక దిక్కులు చూస్తున్నారు.

జిల్లాలో ఉపాధి రంగాలు

పారిశ్రామికంగా విరాజిల్లుతున్న జిల్లాలో భవన నిర్మాణ రంగం, సింగరేణి బొగ్గు గనులు, సిరామిక్స్, సిమెంటు ఫ్యాక్టరీలు తదితర రంగాలు అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి వనరులుగా ఉన్నాయి. వీటిపై ఆధారపడి వేలాది మంది కార్మికులు జీనవం సాగిస్తున్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు కానరాకుండా పోగా.. భవన నిర్మాణ రంగం తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. సింగరేణి గనుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అత్యల్ప సంఖ్యలో పనులు లభిస్తుండగా.. సిమెంటు, సిరామిక్స్ ఫ్యాక్టరీల్లో రెగ్యులర్ కార్మికులు తప్పా అసంఘటిత రంగ కార్మికుల అవసరం ఉండడం లేదు.

మందగించిన నిర్మాణాలు

జిల్లాలో భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. మున్సిపల్, గ్రామ పంచాయతీల నుంచి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు సత్వరంగా జారీ కాకపోవడం, ఇంటి స్థలాలు వివాదాల్లో ఉండడం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయనే ఆశతో అనేక మంది పనులు ప్రారంభించకుండా ఎదురు చూస్తుండడం భవన నిర్మాణరంగంపై ప్రభావం చూపుతున్నాయి.

పడిగాపులు

జిల్లా కేంద్రం మంచిర్యాల, నస్పూర్, శ్రీరాంపూర్, లక్సెట్టిపేట, హాజీపూర్, జైపూర్, చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి ప్రధాన పట్టణాలుగా ఉన్నాయి. ఆయా ప్రాంతాలు కూలీలకు పనులు కల్పించడంలో తోడ్పడుతున్నాయి. అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి కల్పించడంలో భవన నిర్మాణ రంగానిదే అగ్రస్థానం. ఈ రంగంపై ఆధార పడ్డ కార్మికులకు ఏడాది పొడవునా పనులు లభించాల్సి ఉండగా.. ప్రస్తుతం పనులు నిస్తేజంగా సాగుతున్నాయి. ఈ కారణంగా ఆ రంగంపై ఆధార పడ్డ తాపీమేస్త్రీలు, సెంట్రింగ్ వర్కర్లు, కార్మికులు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్‌లు, కార్పెంటర్లు, పెయింటర్లు, స్టోన్ వర్కర్లు, సానిటేషన్, పీవోపీ వర్కర్లు పనులు లేక అవస్థలు పడుతున్నారు. రోజువారీగా కూలీ పని కోసం అడ్డాపైకి వచ్చి పడిగాపులు కాస్తూ నిరాశగా ఇంటికి తిరిగి వెళ్తున్నారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని రెస్టారెంట్లు, హోటళ్లలో పని చేయడానికి సిద్ధపడుతున్నారు. హోటల్ రంగంలోనూ పనుల కోసం పోటీ ఉంటోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

ఇందిరమ్మ ఇళ్లపై భవన నిర్మాణ కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు. పేదలకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయగానే చేతినిండా పని దొరకుతుందనే ఆశావహ దృక్పథంతో ఉన్నారు. ఆ ఇళ్ల కోసం చాలామంది పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఆర్థికంగా కాస్త ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే కలిసి వస్తుందనే ఆశతో సొంతంగా ఇంటి నిర్మాణానికి ముందుకు రావడం లేదు.

ఇంటికి వాపస్ ఎల్తన్నం



పదిహేనేళ్ల నుంచి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న. గిన్నేళ్ల సంది గిప్పుడు న్నట్లు ఎన్నడు సూడలే. ఇప్పుడు వారంల మూడు రోజులకు మించి పనులు దొర్కుత లేవ్. దినాం అడ్డమీదికి వచ్చి పని దొర్కుతదేమోనని గంటలకొద్ది చూసి ఇంటికి వాపస్ ఎల్తన్నం. గిట్ల చేయబట్టి పూట గడవడానికి మస్తు తక్లీబైతంది.

– కంబాల రాజేశం, తాపీ కార్మికుడు

బతుకుదెరువుకు గోసైతంది



రెక్కల కష్టం మీద బతికేటోళ్లం. దినాం పని దొరికితే సంతోషమే కానీ గిప్పుడు పనుల కోసం వెతుకుడైతంది. రోజు ఎవలు పిలుస్తరా అని ఎదురు చూసుడైతంది. నా లెక్కనే చాలామంది పని లేక బతుకు దెరువుకు గోస పడ్తండ్లు. కూరగాయలకు సుత పైసలుంటలేవ్. ఎట్ల బతుకుడో ఏమో సమజైతలేదు.

– కల్వూరి సురేష్, తాపీ కార్మికుడు

ఇళ్ల నిర్మాణాలు తగ్గినయ్



ఎక్కడైన ఎవరైన ఇళ్లు మొదలు పెడితే అనేకమందికి పనులు దొర్కుతయ్. గత రెండేళ్ల సంది నుంచి ఇళ్ల నిర్మాణాలు బాగా తగ్గుతున్నయ్. కొత్తగా ఇళ్లు కట్టేటోళ్లు ముందుకు వస్తలేరు. ఈసారైతే పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి. ఒకలో ఇద్దరో ఇళ్లు కట్టడానికి ముందుకు వస్తండ్లు. గిట్ల భవన నిర్మాణ రంగం పడిపోయి కార్మికుల పరిస్థితి దారుణంగా తయారైంది. సర్కారు కార్మికులను ఆదుకోవాలే.

– తాడిశెట్టి రామ్‌కుమార్, తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడు

జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల వివరాలు(కార్మిక శాఖ రికార్డుల ప్రకారం)

లేబర్ కార్యాలయం	రిజిష్టర్ వర్కర్లు	పురుషులు	మహిళలు	రెన్యూవల్ డ్యూ ఉన్న వర్కర్లు	వ్యాలిడ్ వర్కర్లు
మంచిర్యాల-1	31,329	13,825	17,499	8,137	23,192
మంచిర్యాల-2	18,773	12,419	6,353	7,263	11,510
బెల్లంపల్లి	14,344	8,544	5,799	3,715	10,629
మొత్తం	64,446	34,788	29,651	19,115	45,331



ముడివస్త్రం వచ్చిందోచ్..

- పాఠశాల తెరిచే నాటికి యూనిఫామ్‌లు
- ఎమ్మార్సీలకు చేరిన క్లాత్

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలలు పునః ప్రారంభం నాటికే విద్యార్థులకు ఏకరూప దుస్తులు(యూనిఫామ్) అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతియేటా పాఠశాలలు పునః ప్రారంభమైన కొద్ది రోజుల వరకు యూనిఫామ్ పంపిణీలో జాప్యం జరుగుతూ వస్తోంది. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలు తెరిచే నాటికే యూనిఫామ్‌లు అందించాలని నిర్ణయించారు. ఈ ఏడాది ముందుస్తుగా ప్రతిపాదనలు పంపడంతో అవసరమైన యూనిఫామ్ క్లాత్(ముడివస్త్రం) సరఫరా సాగుతోంది. మండలాల వారీగా ఎమ్మార్సీలకు పంపిణీ జరుగుతోంది. శనివారం జిల్లాలోని కొన్ని మండలాలకు చేరింది. అక్కడి నుంచి దుస్తులు కుట్టేందుకు స్వయ సహాయక సంఘాలకు అప్పగించనున్నారు. 2025-26 విద్యాసంవత్సరం దుస్తుల డిజైన్లలో మార్పులు చేశారు. బాలబాలికలకు వేర్వేరు డిజైన్లలో దుస్తులు కుట్టించనున్నారు. చొక్కాలు, లాంగ్ ఫ్రాక్‌లకు పట్టీలు, భుజాలపట్టీలపైన కఫ్స్, ప్యాచ్ వర్క్ లేకుండా సాధారణ యూనిఫాంలను డిజైన్‌గా మార్చడంతో కుట్టుపని సులువు కానుంది.

జిల్లాలో విద్యార్థులు ఇలా..

జిల్లాలో సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు రెండేసి యూనిఫామ్ జతలు అందించనున్నారు. 761 పాఠశాలల్లో 42,711 మంది చదువుతున్నారు. 20,021 బాలురు, 22,690 మంది బాలికలు ఉన్నారు. ముడివస్త్రం 1,86,723 మీటర్లు అవసరం కాగా.. 58,059 మీటర్ల వస్త్రం జిల్లాకు సరఫరా అయ్యింది. వేసవి సెలవుకు ముందే యూనిఫామ్‌కు అవసరమైన వస్త్రం సరఫరా చేసి సకాలంలో విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.



గదిలో భద్రపరిచిన యూనిఫామ్ క్లాత్

మహనీయుని ఆశయ సాధనకు కృషి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: దేశంలో సమానత్వం కోసం పోరాడి, సమాజ హితం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆ మహనీయుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి కలెక్టర్‌తోపాటు మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు, కార్పొరేషన్ ఈడీ పోటు రవీందర్‌రెడ్డి, దుర్గప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, దళితుల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. 27ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, ఉప ప్రధానమంత్రిగా, రక్షణ, వ్యవసాయ, కార్మిక, రవాణా, తదితర శాఖల కేంద్రమంత్రిగా సేవలందించారని తెలిపారు. వినూత్న సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. బలహీన వర్గాల అభ్యున్నతికి విశిష్ట కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, నీరటి రాజేశ్వరి, రాఫ్‌ఖాన్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భీమిని: కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. కన్నెపల్లి, భీమిని మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. కన్నెపల్లి మండలంలోని చెర్లపల్లి పాఠశాలలో నిర్మించిన అదనపు గదిని ప్రారంభించారు. జన్కాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రానికి, ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ గదికి శంకుస్థాపన చేశారు. టేకులపల్లి, మల్లీడి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు, నాయకన్‌పేట్ పరిధిలోని గొల్లగూడ గ్రామానికి బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. భీమిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మించిన డాక్టర్స్, నర్సు క్వార్టర్లను ప్రారంభించారు. భీమిని, కన్నెపల్లి రైతువేదికల్లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు బికార్ణదాస్, శ్రవణ్‌కుమార్, ఎంపీడీవో గంగమోహన్, పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. మనుమత్ మన్యు సూక్త సహిత రుద్రహోమంలో హన్మాన్ భక్తులతో కలిసి హోమం చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకుడు విజయ్‌శర్మ, హన్మాన్ భక్తులు సన్మానం చేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు కంటి పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని 969 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 37,920 మంది ఉన్నారని, ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అందరికీ కంటి పరీక్షలు చేయనున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా కంటి వైద్యులు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. కనురెప్ప వాలిపోవడం, దూరపు చూపు లేకపోవడం, కంజక్టెల్ ఐడీసీజేస్, దెబ్బ తగలడం, మెల్లకన్ను ఇలా కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మానసిక పరిపక్వతను తెలుసుకునేందుకు స్మార్ట్ చెక్ ద్వారా 42 ప్రశ్నలు అడిగే కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి ఎస్.అనిత, నోడల్ ఆఫీసర్ కే.శంకర్, ఆప్తాలమిక్ అధికారి భాస్కర్‌రెడ్డి, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

మంగెనపల్లిలో ఉద్రిక్తత

- యజమాని ఇంటి ఎదుట పాలేరు మృతదేహం
- పరిహారం కోసం కుటుంబ సభ్యుల ఆందోళన



బందోబస్తులో ఎస్సై శ్యాంపటేల్, పోలీసులు



యజమాని ఇంటి ఎదుట మృతదేహం

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాలేరు కన్నయ్య, అతడి యజమాని ఎనగంటి చిన్నన్న మధ్య శుక్రవారం గొడవ జరగడం, కన్నయ్య మనస్తాపంతో ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. మృతదేహానికి చెన్నూర్ సివిల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శనివారం సాయంత్రం తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని యజమాని చిన్నన్న ఇంటి ఎదుట ఉంచి వెళ్లిపోయారు. మృతికి కారణమైన యజమాని రూ.5లక్షలు పరిహారం ఇవ్వాలని, అప్పటివరకు మృతదేహాన్ని తీయబోమని భీష్మించుకు కూర్చున్నారు. స్థానిక కుల పెద్దలు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం యజమాని బంధువులతో సంప్రదింపులు జరిపారు. యజమాని కుటుంబ సభ్యులు పరారీలో ఉండడం, ఇంటికి తాళం వేసి ఉండడంతో మృతదేహాన్ని అక్కడే ఉంచారు. అర్ధరాత్రి వరకు పరిస్థితి అలాగే ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై శ్యాంపటేల్ సంఘటన స్థలానికి చేరుకుని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది.

క్లుప్తంగా

ఒకరిపై కేసు నమోదు

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లిలో శుక్రవారం పాలేరు నాయిని కన్నయ్య మృతికి కారణమైన యజమాని ఎనగంటి చిన్నన్నపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. శనివారం చెన్నూర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలోని అశోక్‌నగర్ బస్తీలో శనివారం పేకాటస్థావరంపై దాడిచేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. బస్తీకి చెందిన ముక్కెర వెంకటేష్ ఇంటి వద్ద కొందరు పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన బెల్లంపల్లికి చెందిన ముక్కెర వెంకటేష్, జంగం క్రాంతికుమార్, గొడుగు రమేష్, తొగరి సురేష్, యాదగిరి మహేష్, బాకం సుమన్, గజ్జల స్వామి, ఎరుకల శ్రీనివాస్, సుందురీ మల్లాద్రిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.12,550 నగదు, 7 ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గంజాయి స్వాధీనం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామ సమీపంలో ఉన్న తుమ్మగూడలో శనివారం పుస్నక తుకారాం వద్ద నుంచి రూ.6,375 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తుకారం ఇంటి పెరట్లో తనిఖీలు నిర్వహించగా గంజాయి మూట కనిపించిందన్నారు. నిందితుడు తుకారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని చాక్‌పల్లి శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న భోజన్న ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా భైంసా నుంచి నిర్మల్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు వెనుక నుండి ఢీకొట్టింది. ఘటనలో చిన్న భోజన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రున్ని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేదపాఠశాల విద్యార్థి మృతిపై కేసు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని వేద పాఠశాల విద్యార్థి మణికంఠ మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుని తండ్రి హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన బండారి రాజేందర్ ఫిర్యాదు చేశారు. వేద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సెలవు చావుకొచ్చింది!

- ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి
- ఇద్దరినీ మింగిన చెరువు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన
- రెండు కుటుంబాల్లో విషాదం



సంజీవ్ (ఫైల్)



రాహుల్ (ఫైల్)



విలపిస్తున్న రాహుల్ కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: సెలవు ఆ విద్యార్థుల చావుకొచ్చింది. ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలు బలిగొంది. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని వైజాగ్‌కు చెందిన కాంబ్లే దుర్గాప్రసాద్, సత్యభామ దంపతులు ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చారు. మావల మండల కేంద్రంలోని 170 కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వారికి రాహుల్ (9) (నాలుగో తరగతి), విశాల్ ఇద్దరు కుమారులు. ఇద్దర్నీ మావల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్2లో చదివిస్తున్నారు. శనివారం పాఠశాలకు సెలవు ఉండడంతో రాహుల్, విశాల్, స్నేహితుడు చిప్పకుర్తి సంజీవ్ (10)తో కలిసి ఈత కొట్టేందుకు మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44కు ఆనుకుని ఉన్న ఎర్రకుంట చెరువు వద్దకు వెళ్లారు. రాహుల్, సంజీవ్ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. విశాల్ చెరువు చుట్టుపక్కల ఆడుకుంటూ ఉన్నాడు. కొంత సేపటికి రాహుల్, సంజీవ్ నీటిలో మునిగిపోవడంతో గమనించిన విశాల్ విషయాన్ని స్థానికులతో పాటు కుటుంబ సభ్యులకు స మాచారం అందించాడు. మావల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

రెండు రోజుల్లో పుట్టిన రోజు..

గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి రాజ్‌కుమార్ కుమారుడు సంజీవ్ నానమ్మ తారాబాయి వద్ద ఉండి మావల పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. మరో రెండు రోజుల్లో అతని పుట్టినరోజు ఉంది. ఇందుకోసం తారాబాయి తన పింఛన్ డబ్బులతో కొత్త బట్టలు కొనిచ్చేందుకు తీసుకెళ్దామని అనుకుంది. అంతలోనే స్నేహితులు రావడంతో వారితో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికే ఈ విషాదకర వార్త తెలియడంతో తారాబాయి అక్కడికి చేరుకుని నా కోరిక తీరక ముందే వెళ్లిపోయావా.. అంటూ గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

వాలీబాల్ పోటీల విజేత హైదరాబాద్



రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. హైదరాబాద్ జట్టు విజేతగా బెల్లంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించిన సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల్లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు అద్భుత ఆటతీరును ప్రదర్శించి విజయ కేతనం ఎగురవేసింది.

సింగరేణిలో క్రీడలకు పెద్దపీట

సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్దపీట వేస్తోందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం భీమన్న స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పని చేసిన ఓ ఉద్యోగి పేరుతో 36 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల్లో క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, ఓటమిని కారణాలను విశ్లేషించుకుంటూ గెలుపు దిశగా క్రీడాకారులు పయనించాలన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 20 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, ఆర్జీ–2 ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో విద్యుత్ దీపాల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

'భక్తుల భద్రత గాలిలో దీపమే' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి బాసర గ్రామ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్ స్పందించారు. బాసర ఆలయంతో పాటు ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, గోదావరి నది స్నాన ఘట్టాలు, తదితర ప్రాంతాల్లో 'సాక్షి' పరిశీలన చేపట్టింది. రాత్రి సమయంలో చీకట్లో ఉన్న పరిస్థితులను కథనంలో ప్రచురించింది. స్పందించిన అధికారులు రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన రోడ్ల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. – భైంసా/బాసర



రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ దీపాలు

కళాకారులకు ఉపాధి కల్పిస్తాం

- టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్



మాట్లాడుతున్న నాగబాల సురేశ్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలోని కళాకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలంగాణ టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఔత్సాహిక కళాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యువ దర్శకుడు దండనాయకుల మానస్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో అనేక ప్రకృతి వనరులు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే సినిమా, సీరియల్స్ షూటింగ్‌లకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇప్పటి వరకు 27 సీరియల్స్, 927 డాక్యుమెంటరీలు నిర్మించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 110 మందిని బుల్లితెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పిస్తామన్నారు. షూటింగ్ కోసం జిల్లాకు వచ్చే కళాకారులకోసం ప్రత్యేక స్టూడియోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సీఎంతో పాటు, సినిమా ఇండస్ట్రీ చైర్మన్ దిల్‌రాజు దృష్టికి తీసుకెళ్లానన్నారు. సమావేశంలో నవజ్యోతి సాంస్కృతిక సారథి అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు రాధాకృష్ణాచారి, జిల్లాలోని కళాకారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజన్న



కావటి రాజన్న

జన్నారం: పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జన్నారం మండలంలోని పొనకల్ పీఏసీఎస్ కార్యదర్శి కావటి రాజన్న శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మచ్చా మధుకర్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రావు, సలహాదారులుగా రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూరగాయలు అమ్మేందుకు వచ్చి మృత్యుఒడిలోకి..

- విద్యుత్‌షాక్‌తో యువరైతు మృతి



పొచ్చన్న (ఫైల్)

తాంసి: కూరగాయలు విక్రయించేందుకు వచ్చి విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన అశిలీ పొచ్చన్న (38) తనకున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని 20 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. వాటిని జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం కూరగాయలు విక్రయించడానికి జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు వచ్చాడు. విక్రయించిన అనంతరం రాత్రి సమయంలో విద్యుత్‌బల్బును తొలగించే క్రమంలో షాక్ కొట్టడంతో పక్కనున్న రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

వాంకిడి: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై పోశెట్టి తెలిపిన వివరాల మేరకు సిర్పూర్(టి) మండలంలోని మేడ్‌పెల్లి గ్రామానికి చెందిన మడావి రాజ్‌కుమార్ (22) శుక్రవారం వాంకిడి మండలంలోని బండకాస గ్రామంలో ఉన్న బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వాంకిడికి వచ్చి వెళ్తుండగా నవేధరి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమ్రె విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వరకు ఆందోళన

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని మృతుని బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు మృతదేహంతో రహదారిపై ఆందోళన చేపట్టారు. దహన సంస్కారాలకు రూ. 50 వేలు, పరిహారం కింద రూ.3 లక్షలు ఇచ్చేందుకు ట్రాక్టర్ యాజమాని ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి...

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దిలీప్ గుజర్ (20) కుప్టి వద్ద గల ధాబా హోటల్‌లో పనిచేస్తున్నాడు. హోటల్ యజమాని పని నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్తున్న క్రమంలో అతన్ని బస్సు ఎక్కించి హోటల్‌కు వెళ్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సరస్వతీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ శివారులోని సరస్వతి కాలువలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. రాచాపూర్ కారోబార్ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ వర్మ, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్ తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామ సమీపంలో పెన్‌గంగ నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతునికి సుమారు 50 ఏళ్లు ఉంటాయన్నారు.

హీరాసుకా జెండా తొలగింపుపై చర్చావేదిక

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు



చర్చావేదికలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుకా స్మారక జెండాను ఇటీవల గుర్తు తెలియని దుండగులు తొలగించారు. దీనిపై శనివారం కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నాలుగు సగల ఆదివాసీలతో చర్చావేదిక నిర్వహించారు. నాగోబా ప్రాంగణంలో హీరాసుక జెండాను ఏర్పాటు చేయడం సరికాదని, వేరేస్థలంలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో కొనసాగుతున్న ఆదివాసీల చర్చావేదికను ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్ ద్వారా తెలుసుకున్నారు.

నూతన గనులు ఏర్పాటు చేయాలి



డైరెక్టర్‌ను సత్కరిస్తున్న ఐఎన్టీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ నేతలు శనివారం కంపెనీ డైరెక్టర్‌ను కోరారు. ఆర్జీవన్ ఏరియాలో పర్యటన నిమిత్తం వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) కొప్పుల వెంకటేశ్వర్లును ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ.జనక్‌ప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో సుదీర్ఘకాలం ఒకేస్థానంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలన్నారు. ప్రస్తుతం పదేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని, దీన్ని ఐదేళ్లకు కుదించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉద్యోగుల రక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అధికారుల పనితీరును అంచనా వేసే విధంగా పర్ఫార్మెన్స్ ఇండికేటర్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. అనంతరం డైరెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిగౌడ్, ఆర్జీ 1 ఏరియా ఉపాధ్యక్షులు సదానందం, నాయకులు వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, లింగమూర్తి, సాయి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఘర్షణకు దిగుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో శనివారం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్రం నిధులతోనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని, అందుకు ప్రతీ రేషన్ షాపు వద్ద బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు మోదీ ఫ్లెక్సీని తొలగించడంతో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను శాంతింపజేశారు.

సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సంతోష్, రిటైర్డ్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రప్రకాశ్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సమ్మయ్య, వాణిశ్రీ, రాజారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.